క్లుప్తంగా

ఎస్వీడీ మహిళా డిగ్రీ కళాశాలకు న్యాక్ బి గ్రేడ్

నిడదవోలు: స్థానిక ఎస్వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు న్యాక్ బి ప్లస్, ప్లస్ గ్రేడ్ లభించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రుద్ర తెలిపారు. గతంలో సి గ్రేడ్‌లో ఉన్న కళాశాల మూడు దశలను దాటుకుని ఈ ఏడాగి బి గ్రేడ్ సాధించిందన్నారు. గత నెల 9,10 తేదీల్లో న్యాక్ బృందం ఈ కళాశాలను సందర్శించింది. ఇక్కడి వసతులు, ల్యాబ్‌లోని పరికరాలను క్షుణంగా పరిశీలించారు. వ్యాయామ పరికరాలను, వనరులను చూసి అభినందించారు. అలాగే అధ్యాపకుల రికార్డులు, విద్యార్థుల పరీక్ష ఫలితాలను పరిశీలించారు. డిగ్రీ కళాశాలల పరీక్ష ఫలితాల్లో ఎస్వీడీ మహిళా డిగ్రీ కళాశాల జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉన్నందున ప్రిన్సిపాల్ రుద్రను న్యాక్ బృందం అభినందించారు. అధ్యాపకుల పనితీరు, విద్యార్థుల క్రమశిక్షణ, కళాశాల ప్రాంగణం పరిశుభ్రత, బొటానికల్ గార్డెన్, గ్రీన్ హౌస్, కళాశాలలోని వివిధ విభాగాలు, జేకేసీ, ఎన్ఎస్ఎస్, మహిళా సాధికారత విభాగాల పనితీరును పరిశీలించిన న్యాక్ బృందం సంతృప్తి వ్యక్తం చేసింది.

పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్ సర్వీసులు

నిడదవోలు: కార్తిక మాసం సందర్భంగా ప్రతి ఆదివారం నిడదవోలు ఆర్టీసీ డిపో నుంచి పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్ సర్వీసులను నడుపుతున్నట్టు స్థానిక డిపో మేనేజర్ కె. శ్రీరామ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. టికెట్ ధరను ఒక్కో ప్రయాణికుడికి రూ.700గా నిర్ణయించామన్నారు. నిడదవోలు ఆర్టీసీ డిపో ప్రస్తుత ఎంక్వైరీ నంబర్ 08813 221064ను మార్చు చేసి కొత్తగా 73820 01185 అనే సెల్ నంబర్‌ను మనుగడలోకి తీసుకు వచ్చామన్నారు. ప్రజలు ఏవిధమైన విచారణకు, సమాచారం కోసం కొత్త నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

డిసెంబర్ నుంచి రేషన్ డిపోల ద్వారా కందిపప్పు

నల్లజర్ల: డిసెంబర్ నెల నుంచి రేషన్ డిపోల ద్వారా కందిపప్పు సరఫరా చేయనున్నారు. అయితే 40 శాతం కందిపప్పు మాత్రమే వస్తుందని డిప్యూటీ తహసీల్దార్ (సివిల్ సప్లయిస్) సత్యనారాయణ వెల్లడించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం రేషన్ డీలర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా 1 నుంచి 17వ తేదీ వరకూ డిపోల వద్ద డీలర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సంఘ అధ్యక్షులు చీమకుర్తి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సారాతో ఒకరి అరెస్ట్

గోపాలపురం: మండలంలోని కోమటికుంటలో సారా తరలిస్తున్న అదే గ్రామానికి చెందిన నెర్సు రాంబాబు అనే వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సీఐ డి.సుధ ఒక ప్రకటనలో తెలిపారు. రాంబాబు వద్ద నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, అతడిని కొవ్వూరు కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు.

అవంతీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు


అవంతీ ఫౌండేషన్ చైర్మన్ ఇంద్రకుమార్

కొవ్వూరు: అల్లూరి బాపినీడు హెల్త్ క్లినిక్ ఆధ్వర్యంలో ఈనెల19న, డిసెంబర్ 10న కొవ్వూరు పట్టణంలో ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు అవంతీ ఫౌండేషన్ చైర్మన్ అల్లూరి ఇంద్రకుమార్ తెలిపారు. ఆ వివరాలను శుక్రవారం ఆయన కొవ్వూరులో విలేకరులకు వెల్లడించారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో ఈనెల 19 ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. వైద్యులు ఈ శిబిరానికి హాజరైన రోగులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. అలాగే డిసెంబర్ 10న స్థానిక మెరక వీధిలోని వాటర్ ట్యాంకు జంక్షన్ వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. ఆదిత్య విశ్వాస్ కె.(జనరల్ మెడిసిన్), రోహిత్ జైన్ (ఎండీ జనరల్ ఫిజీషియన్) రోగులకు వైద్య సేవలందిస్తారన్నారు. వివరాలకు 08813- 233277, 89789 11399 అనే నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ కార్గో సేవలపై అవగాహన ర్యాలీ

కొవ్వూరు: ఆర్టీసీ అందిస్తున్న కార్గో సేవలను ప్రజలు సద్వినియోగ పరుచుకోవాలని కొవ్వూరు డిపో మేనేజర్ వైవీఎస్ కుమార్ సూచించారు. కార్గో డెలివరీ మాసోత్సవాల్లో భాగంగా డిపోలోని సిబ్బందితో కలిసి శుక్రవారం కొవ్వూరు మెయిన్ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ కార్గో సేవలు, పార్సిల్స్ డోర్ డెలివరీ గురించి ప్రజలకు వివరించారు. కార్గో ద్వారా సరకు రవాణా చేసుకుంటూ ఆర్టీసీ బలోపేతానికి సహకరించాలని ఆయన ప్రజలను కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏయే ఆర్టీసీ డిపోల్లో కార్గో సేవలు అందుబాటులో ఉన్నాయో తెలియజేసే ఫెక్సీతో పురవీధుల్లో ర్యాలీ చేశారు.

సనాతన ధర్మాన్ని పాటించాలి

ఉండ్రాజవరం: విద్యార్థులు సనాతన ధర్మాన్ని పాటిస్తూ మంచి పౌరులుగా ఎదగాలని ప్రముఖ వాస్తు సిద్ధాంతి వెలిచర్ల నాగదత్తశర్మ హితవు పలికారు. ఉండ్రాజవరం శాఖా గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

మంచి జరిగినట్టు భావిస్తేనే మద్దతు

- ప్రజలకు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు విజ్ఞప్తి
- చిన్నాయగూడెంలో పల్లె నిద్ర
- 'వై ఏపీ నీడ్స్ జగన్ ' లో భాగంగా గ్రామంలో పర్యటన


దేవరపల్లి మండలం చిన్నాయగూడెంలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: గత నాలుగున్నరేళ్ల జగనన్న సంక్షేమ పాలనలో మంచి జరిగిందని భావిస్తేనే మద్దతు ఇవ్వాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రజలను కోరారు. మండలంలోని చిన్నాయగూడెంలో పల్లె నిద్ర అనంతరం శుక్రవారం ఉదయం ఆయన ఆ గ్రామంలో పర్యటించారు. గృహ సారథులు, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి పలు గృహాలను సందర్శించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, పేదలకు అందించిన సంక్షేమ పథకాలు, మేనిఫెస్టో, గత నాలుగున్నరేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధి, అమలు చేసిన మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. సీఎం జగనన్న పాలనలో అన్నివర్గాల ప్రజలకు మంచి జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో జగనన్న ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేశారని తలారి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు జగనన్నే కావాలి బుక్‌లెట్‌ను ఆయన ప్రజలకు అందజేశారు. చిన్నాయగూడెంలో సుమారు రూ.60 కోట్ల విలువైన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేసినట్టు వివరించారు. జనవరి నుంచి పింఛన్ రూ.3000 పెంచి ఇస్తున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వానికి, జగనన్న ప్రభుత్వానికి మధ్య గల వ్యత్యాసాన్ని గమనించి మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి గడా జగదీష్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మేడిబోయిన గంగరాజు, ద్వారకా తిరుమల దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు ఆచంట అనసూయ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గడా రాంబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు తాడిమళ్ల మహేంద్రకుమార్, ఎంపీటీసీ సభ్యురాలు మరపట్ల నాగమణి, విప్పర్తి చంద్ర, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యురాలు ఉన్నీషా తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు కావాలంటే..

గోపాలపురం: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డినే ఎన్నుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ అన్నారు. 'వై ఏపీ నీడ్స్' జగన్ కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి ఆయన మండలంలోని గుడ్డిగూడెంలో పల్లె నిద్ర చేశారు. శుక్రవారం ఉదయాన్నే ఎంపీపీ, ఇతర నాయకులు ఆ గ్రామంలో పర్యటించారు. ఇంటింటా తిరిగి సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలకు వివరించారు. ఎవరికైనా పథకాలు అందకపోతే వారికి అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 24 పేజీల బుక్‌లెట్‌ను ప్రజలకు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, జిల్లా అధికార ప్రతినిధి ఎస్‌కె వల్లీ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, సర్పంచ్ మడిచర్ల ప్రసాద్, ఏఎంసీ వైస్ చైర్మన్ తోట నాగేశ్వరరావు, మండల బీసీ కమిటీ చైర్మన్ దూళిపాల ప్రభాకర్ పాల్గొన్నారు.


గోపాలపురం మండలం గుడ్డిగూడెంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నాణ్యమైన పొగాకు

ఉత్పత్తి చేయాలి

బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్


వేళ్లచింతలగూడెంలో పొగాకు సాగులో డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిని పరిశీలిస్తున్న బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

గోపాలపురం: అంతర్జాతీయ మార్కెట్ ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన పొగాకును ఉత్పత్తి చేయాలని గుంటూరు పొగాకు బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్‌కుమార్ రైతులకు సూచించారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం ఆయన రైతులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన పొగాకు తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ యశ్వంత్‌కుమార్ మాట్లాడుతూ గతేడాది మార్కెట్ ఆశాజనకంగా ఉన్నంత మాత్రాన ఈ ఏడాది ఎక్కువ విస్తీర్ణంలో పొగాకును సాగు చేయడం మంచిది కాదన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా రైతులు పొగాకు ఉత్పత్తి చేయాలని సూచించారు. ఎరువుల ధరలను తగ్గించాలని, ఎస్‌ఓపీని అందుబాటులోకి తీసుకు రావాలని ఈ సందర్భంగా పలువురు రైతులు చైర్మన్‌ను కోరారు.

సీఎం జగన్ దృష్టికి ఇళ్లస్థలాల సమస్య


నూజివీడులో ముఖ్యమంత్రి జగన్‌కు ఇళ్ల స్థలాల సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: గోపాలపురం నియోజకవర్గంలోని ఇళ్ల స్థలాల సమస్యను ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. శుక్రవారం ఏలూరు జిల్లా నూజివీడు పర్యటనకు విచ్చేసిన సీఎం జగన్‌కు తలారి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో 85 పంచాయతీలు ఉండగా, 65 పంచాయతీల్లో జగనన్న లే అవుట్లు ఏర్పాటు చేసి గృహ నిర్మాణాలు చేపట్టినట్టు ఎమ్మెల్యే వెంకట్రావు వివరించారు. కోర్టు వివాదాల కారణంగా ఇంత వరకూ మిగిలిన 20 పంచాయతీల్లో భూసేకరణ జరగనందున, పేదలకు ఇళ్ల స్థలాలు అందలేదన్నారు.90 రోజుల (నైన్టీ డేస్)లో దరఖాస్తు చేసుకున్న అర్హులకు పట్టాలు పంపిణీ చేయవలసి ఉందని సీఎంకు వివరించినట్టు తలారి తెలిపారు. దీనిపై ఏలూరు, తూర్పు గోదావరి జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు ఇస్తామని సీఎం జగన్ తనకు హామీ ఇచ్చారని ఎమ్మెల్యే వెంకట్రావు తెలిపారు.

హేమకు వరల్డ్ టెన్నికాయిట్ టోర్నీలో స్వర్ణం


బంగారు పతకం గెలుచుకున్న హేమమాధురి

నల్లజర్ల: మండలంలోని ప్రకాశరావుపాలెంలోని వైజ్ ఇంజినీరింగ్ కళాశాల, బీటెక్ సెకండియర్ విద్యార్థిని జి.హేమమాధురి భారతదేశం తరపున సౌత్ ఆఫ్రికాలో ఇటీవల నిర్వహించిన ప్రపంచ టెన్నికాయిట్ -2023 పోటీల్లో పాల్గొని బంగారు పతకం గెలుచుకుంది. అంతేగాకుండా ఈ పోటీల వ్యక్తిగత చాంపియన్ షిప్‌లో రజత పతకం సాధించింది. ఈ క్రమంలో శుక్రవారం ఆ కళాశాలలో హేమమాధురిని కళాశాల యాజమాన్యం తరపున సత్కరించారు. కళాశాల సెక్రటరీ,కరస్పాండెంట్ ఆకుల త్రిమూర్తి, ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.అరవిందకుమార్, ప్లేస్‌మెంట్ అధికారి ఏఎస్ ప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు ఆమెను అభినందించారు.

ఆమె బరిలోకి దిగితే పతకాల పంటే..

దేవరపల్లి మండలం యర్నగూడేనికి చెందిన జి.రామ్మోహనరావు, స్వరూప దంపతుల కుమార్తె అయిన హేమమాధురికి ఐదో తరగతి నుంచే క్రీడల పట్ల ఆసక్తి కనబరచడంతో తల్లిదండ్రులు ఆమెను ప్రోత్సహించారు. 2016లో టెన్నికాయిట్ విభాగంలో టీమ్ చాంపియన్ షిప్ బ్రాంజ్ మెడల్, 2018 పశ్చిమ బెంగాల్‌లో టీమ్ ఛాంపియన్ షిప్‌తో పాటు బ్రాంజ్ మెడల్, 2018 చండీఘడ్‌లో వ్యక్తిగత చాంపియన్ షిప్‌లో పాటు బంగారు పతకం సాధించింది. 2022లో తమిళనాడులో టీమ్ ఛాంపియన్ షిప్, బ్రాంజ్ మెడల్, 2023లో హర్యానాలో డబుల్స్ విభాగంలో బ్రాంజ్ మెడల్, వరల్డ్ కప్ చాంపియన్ షిప్ సౌతాఫ్రికాలో వ్యక్తిగతంగా బ్రాంజ్‌మెడల్, డబుల్స్‌లో బంగారు పతకం సాధించింది. అలాగే హేమామాధురికి క్రికెట్‌లోనూ ప్రావీణ్యం సాధించి, పలు పతకాలు గెలుచుకుంది.

పుట్టలోని నాగన్నకు పూజలు


ఉండ్రాజవరం మండలం కె.సావరం కోస్టల్ ఆగ్రో ఇండస్ట్రీస్ ఆవరణలోని పుట్ట వద్ద భక్తుల పూజలు

నిడదవోలు: నాగుల చవితి పండగను శుక్రవారం నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, విద్యుత్ సబ్ స్టేషన్ ప్రాంగణాలు, లయన్స్ కంటి ఆసుపత్రి వెనుక గల పొలాలు, సెయింట్ ఆంబ్రోస్ స్కూల్ ఆవరణ వద్ద గల పొలాల్లోని పాము పుట్టల వద్ద పూజలు నిర్వహించారు. పుట్టల్లో పాలు పోసి నాగ దేవతను ఆరాధించారు. మహిళలు చలివిడి, చిమ్మిలి, అరటి పండ్లు, తాటి బుర్రగుంజు, తేగలు, కోడిగుడ్లు పుట్టల్లో వేసి నాగదేవతకు నైవేద్యంగా సమర్పించారు. వివాహం కానివారు వివాహం జరగాలని, సంతాన ప్రాప్తి కలగాలని కోరుకుంటూ నాగేంద్రుడికి పూజలు చేశారు. పుట్టల వద్ద బాణసంచా కాలుస్తూ పెద్దలు, పిల్లలు సందడి చేశారు.

నిడదవోలు రూరల్: నాగుల చవితి పర్వదినాన్ని మండలంలోని వివిధ గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. సమిశ్రగూడెం, కోరుమామిడి, పురుషోత్తపల్లి, కలవచర్ల తదితర గ్రామాల్లో ఎక్కడ చూసినా పొలం గట్లు జనంతో సందడిగా కనిపించాయి. ఎవరికి వారు తమ కుటుంబ సభ్యులతో కలిసి పొలాల్లోని పాము పుట్టల వద్దకు వెళ్లి నాగేంద్రునికి పూజలు చేశారు. చిన్నారులు పుట్టల వద్ద బాణసంచా కాలుస్తూ సందడి చేశారు. సమిశ్రగూడెంలోని నాగలింగేశ్వరస్వామి ఆలయం తెల్లవారుజాము నుంచి భక్తులతో కిటకిటలాడింది. ఆలయ స్థాపకుడు బిక్కవోలు సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో నాగదేవతను ప్రత్యేకంగా పుష్పాలంకరణ చేసి అభిషేకాలు, పూజలు జరిపించారు.

ఉండ్రాజవరం: ఉదయం నుంచే భక్తులు పుట్ట దగ్గరకు వెళ్లి విశేష పూజలు చేశారు. ఉండ్రాజవరం, మోర్త, చిలకపాడు, కె.సావరం గ్రామాల్లోని శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల వద్ద గల పుట్టలపై పిల్లలను ఉంచి గారెలు, బూరెలు వేసి మొక్కులు తీర్చుకొన్నారు.

దేవరపల్లి: ఉదయాన్నే భక్తులు కుటుంబ సమేతంగా పొలాల్లోని పుట్టల వద్దకు చేరుకుని పుట్టలకు పూజలు నిర్వహించారు. భక్తులతో పచ్చని పంట పొలాలు కళకళలాడాయి. గ్రామాల్లోని సుబ్రహమణ్యేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో స్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

కుమారదేవంలో తాటాకిల్లు దగ్ధం


బాధిత కుటుంబానికి రేషన్ అందిస్తున్న దాతలు

కొవ్వూరు: కుమారదేవం గ్రామంలోని కొత్తపేటలో శుక్రవారం ఉదయం పెరుగు వెంకటేశ్వర్లుకు చెందిన తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. నాగుల చవితి కావడంతో పుట్ట వద్ద పూజ చేసేందుకు వెంకటేశ్వర్లు కుటుంబం మొత్తం బయటకు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు వ్యాపించాయి. ఇంట్లోని సామగ్రి అంతా కాలి బూడిదైంది. కొవ్వూరు అగ్ని మాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. నిరాశ్రయులైన వెంకటేశ్వర్లు కుటుంబానికి వైఎస్సార్ సీపీ నాయకుడు, కుమారదేవం ఎత్తిపోతల పథకం రైతు సంఘం అధ్యక్షుడు గోలి శ్రీనివాస్ ఆర్థిక సాయంతో నెలకు సరిపడా నిత్యాసర సరుకులు, నలుగురు కుటుంబ సభ్యులకూ నూతన వస్త్రాలు, దుప్పట్లు, బియ్యం, కూరగాయలు అందజేశారు. ఉప సర్పంచ్ గద్దే రామకృష్ణ, నున్న నాగేశ్వరరావు, అడబాల సత్యనారాయణ, గోరిజాల పేర్రాజు, తమ్మిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సురక్షలో 112 మందికి కళ్లజోళ్ల పంపిణీ

కొవ్వూరు: మండలంలోని కుమారదేవంలో అక్టోబర్ 19న నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో పలువురికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. వారిలో 105 మందికి కళ్లజోళ్లు అవసరమని నేత్ర వైద్యులు నిర్ధారించారు. అలాగే ఏడుగురు పాఠశాల విద్యార్థులకు కూడా కళ్లజోళ్లు అవసరమని తేల్చారు. అలాగే 14 మందికి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు. ప్రభుత్వం సరఫరా చేసిన కళ్లజోళ్లను శుక్రవారం 112 మందికీ ఉప సర్పంచ్ గద్దే రామకృష్ణ, కుమారదేవం ఎత్తిపోతల పథకం రైతు సంఘం అధ్యక్షుడు గోలి శ్రీనివాస్, ఇతర నాయకుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని రాజమహేంద్రవరంలో డాక్టర్ స్వేతా సజ్జా ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ కె.బాలుప్రశాంత్, వైఎస్సార్ సీపీ నాయకులు గోరిజాల పేర్రాజు, గండి పోశమ్మ ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ గంధం శ్రీనివాస్, వైద్య,ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దేవంలో 110 మందికి కంటి పరీక్షలు


పెద్దేవంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు

తాళ్లపూడి: లయన్స్ క్లబ్ మండల శాఖ ఆధ్వర్యంలో పెద్దేవంలో శుక్రవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కుంటముక్కల వీరభద్రరావు ప్రారంభించారు. నిడదవోలుకు చెందిన శ్రీమతి రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ ఆసుపత్రి వారు ఉచితంగా 110 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. వారిలో 20 మందికి ఆపరేషన్లు అవసరమని నేత్ర వైద్యుడు నాగరాజు నిర్ధారించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు మారిన రామమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకుడు తోట రామ కృష్ణ, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ నాగేంద్ర పాల్గొన్నారు.

సురక్ష వైద్య సేవలు అభినందనీయం


నల్లజర్లలో రిఫరల్ కేసులను ఉన్నత ఆసుపత్రులకు తరలిస్తున్న వైద్య ఉద్యోగులు

నల్లజర్ల: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో ఉన్నత వైద్యం కోసం సిఫార్సు చేసిన రోగులను కార్పొరేట్ ఆసుపత్రులకు తీసుకెళ్లి వైద్యం చేయిస్తున్న నల్లజర్ల పీహెచ్‌సీ వైద్యులు, ఆరోగ్య సిబ్బంది సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టరు అనసూరి పద్మలత కొనియాడారు. ఆమె శుక్రవారం నల్లజర్ల పీహెచ్‌సీని సందర్శించారు. అదే సమయంలో రిఫరల్ కేసులను ప్రత్యేక బస్సులో కార్పొరేట్ ఆసుపత్రులకు తీసుకువెళ్లడాన్ని ఆమె చూశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను నూరు శాతం ఇక్కడ అమలు చేస్తూ సురక్ష కార్యక్రమానికి సార్ధకత చేకూర్చారన్నారు. నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టర్లు తెల్లం గంగాధరరావు, మహ్మద్ సిరాజుద్దీన్‌లను ఆమె అభినందించారు. ఇక్కడ మొత్తం 182 రిఫరల్ కేసులు రాగా 52 మందిని గోపాపురం సీహెచ్‌సీకి తీసుకెళ్లామని, మిగిలిన వారిని దఫదఫాలుగా కార్పొరేట్ ఆసుపత్రులకు తీసుకెళ్లి మెరుగైన వైద్యం అందిస్తున్నట్టు డాక్టరు గంగాధరరావు ఆమెకు వివరించారు.

గడపగడపకూ పారదర్శకంగా సంక్షేమం

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- ఉండ్రాజవరం గ్రామంలో పర్యటన


మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

ఉండ్రాజవరం: సంక్షేమ పథకాలను పారదర్శకంగా గడపగడపకూ పారదర్శకంగా అందిస్తున్నామని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో శుక్రవారం ఉండ్రాజవరం గ్రామంలోని కొబ్బరితోట, రజకపేటలలో ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు ఇంటింటికీ వెళ్లారు. నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు వివరించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే పరమావధిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల ఇంటికే సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. అన్ని వర్గాల్లోని ప్రతి కుటుంబానికీ ఏదో ఒక సంక్షేమ పథకం వర్తించిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, సర్పంచ్ మెండే వెంకట్రావు, సొసైటీ అధ్యక్షుడు సంకురాత్రి సుబ్బారావు, వైస్ ఎంపీపీ నరహరశెట్టి సరోజ, వేండ్ర మురళి సాయిబాబా, నిమ్మన శ్రీనివాసు, అద్దేపల్లి విజయ్‌కుమార్, నూకపొయ్యి రాకేష్, ఉప్పలపాటి ఫణీంద్ర, దోనేపూడి సుధాకర్, బీఎస్సార్ శ్రేణులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే లక్ష్యంగా సొసైటీలు పనిచేయాలి

కొవ్వూరు: వ్యవసాయ సహకార పరపతి సంఘాలు రైతు శ్రేయస్సే లక్ష్యంగా బై లాకు లోబడి పనిచేయాలని డివిజనల్ సహకార అధికారి కె.సుబ్బారావు అన్నారు. 70వ సహకార వారోత్సవాల సందర్భంగా శుక్రవారం ఆరికిరేవుల సొసైటీ వద్ద సొసైటీ అధ్యక్షుడు చావా పేర్రాజు (నానిబాబు) సప్త వర్ణ సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ పరిధిలోని రైతులకు సకాలంలో రుణ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. రాందాస్ సహకార శిక్షణ కేంద్రం (రాజమహేంద్రవరం) ప్రిన్సిపాల్ వెదురుపాటి శ్రీనివాస్ సహకార వారోత్సవాల ప్రాధాన్యతను వివరించారు. సొసైటీ సీఈవో సీహెచ్ ప్రసాద్ గతేడాది సంఘ ఆర్థిక లావాదేవీలు, రాబోయే ఆర్థిక సంవత్సరంలో సంఘం కార్యచరణ ప్రణాళికను వివరించారు.

నేడు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

కొవ్వూరు: కార్తిక మాసం సందర్భంగా పట్టణంలోని గోష్పాద క్షేత్రంలోని ధర్మ జ్ఞాన కళావేదికలో శనివారం సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకూ సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించనున్నారు. దంపతులుగాను, విడిగాను, యుక్త వయస్సు పిల్లలు సైతం ఈ వ్రతం చేయించుకోవచ్చని పురుషోత్తమ ధర్మ ప్రచార సభ నిర్వాహకులు తెలిపారు.వివరాల కోసం 70323 00175, 94402 22470 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

హైరిస్క్ గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి

చాగల్లు: హైరిస్క్ గర్భిణులు జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి కె.నిశిత సూచించారు. బంగారు తల్లి కార్యక్రమంలో భాగంగా బ్రాహ్మణగూడెం గ్రామంలో గర్భిణులకు శుక్రవారం ఆమె అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ నిశిత మాట్లాడుతూ గర్భిణులను కలిసి, వారితో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి ఆరోగ్య సలహాలు, సూచనలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ వి.పద్మ, నరసమ్మ, ఎంపీహెచ్ఏ ఎం.రాజశేఖర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మిస్టర్ నిడదవోలుగా ప్రవీణ్


మిస్టర్ నిడదవోలుగా ఎంపికైన జువ్వల ప్రవీణ్‌ను, క్రీడాకారులను అభినందిస్తున్న సాయిబాబు

ఉత్సాహంగా బాడీ బిల్డింగ్ పోటీలు

నిడదవోలు: 'మిస్టర్ నిడదవోలు'గా జువ్వల ప్రవీణ్ ఎంపికయ్యారు. స్థానిక రాయల్ ఫిట్నెస్ జిమ్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గురువారం రాత్రి శరీర సౌష్టవ పోటీలు నిర్వహించారు. పట్టణానికి చెందిన పలువురు బాడీ బిల్డర్స్ ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన జువ్వల ప్రవీణ్‌కు రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ మాజీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు రూ.30,000 నగదు బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గోపిరెడ్డి శ్రీనివాస్, కారింకి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ ఫయాజ్, తోలేటి కోటి, జిమ్ నిర్వాహకులు గౌతమ్ జైన్, పినిశెట్టి ఫణి, దాకే అనిల్‌కుమార్, రాకేష్, నియోజకవర్గ వ్యాయామోపాధ్యాయుల సంఘం గౌరవాధ్యక్షుడు పాలేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.